ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 17 జూన్ 2025



మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ అనూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల డిగ్రీల కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటునాణ్యమైన భోజనం, విద్యను అందిస్తామన్నారు. మహిళ విద్యార్థులు బీఎస్సీ ఎంసీపీ, బీజడ్‌సీ ఎంఎస్ డీఎస్, బీఎస్ఎం జడ్‌సీ, బికాం జనరల్, బికాం కంప్యూటర్స్, బీఏ అడ్మిషన్లు చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి...

జన్నారం, జూన్16 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఈ నెల 19 నుంచి తెలంగాణలోని హకీంపేట స్పోర్ట్ స్కూల్, కరీంనగర్ స్పోర్ట్ స్కూల్, ఆదిలాబాద్ స్పోర్ట్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశానికి ఎంపిక పోటీలు ఉంటాయని బాలురు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 19న ఎంపిక పోటీల కు హాజరుకావాలన్నారు.

ఈ పోటీల్లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2017 సంవత్సరంలో 9నెలలో జన్మించినవారై ఉండి ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకో వాలని అనంతరం అర్హత పత్రాలతో ఎంపిక పోటీలకు హాజరుకావాలని అన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

మంచిర్యాలక్రైం, జూన్16 (ఆంధ్ర జ్యోతి): సోమవారం విడుదలైన ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు 1064 విద్యార్థులకు గాను 659 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషన్‌లో 187 మంది విద్యార్థులకు గాను 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 1552 మంది విద్యార్థులు కాగా 961 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషన్‌లో 129 మంది విద్యార్థులకు గాను 140మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

- జిల్లాలో 12,131 యూనిట్లకు గాను 52,839 మంది దరఖాస్తు
- లబ్ధిదారుల ఎంపికలో మరింత జాప్యం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలులో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ పథకానికి అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. అయితే అనర్హులకు లబ్ధి చేకూరుతోందని పలువురు మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పథకం అమలుకు తాత్కాలిక బ్రేక్ పడినట్లయింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో అర్హులకు లబ్ధి చేకూరకుంటే ప్రభుత్వంపై విమర్శలు వచ్చే అవకాశం ఉందన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

- కాసిపేట,(ఆంధ్రజ్యోతి)

7

నిబంధనలు గాలికి..

- రేషన్ షాప్ పునరుద్ధరణలో అనుమానాలు
- కానరాని 108 క్వింటాళ్ల బియ్యం
- స్టాక్ లేకపోవడంతో 6ఏ కేసు నమోదు
- సరుకు విలువ రూ. 3 లక్షల పైనే
- నిబంధనల మేరకు రూ. 7 లక్షల వరకు పెనాల్టీ
- రూ. 10వేల అపరాద రుసుముతో సరిపెట్టిన వైనం



అధికారులు సీజ్ చేసిన కాలేజ్‌రోడ్డులోని రేషన్ షాప్

మంచిర్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాప్ పునరుద్ధరణలో సంబంధిత అధికారులు నిబంధనలను గాలికి వదిలివేయగా, దాని వెనుక పెద్ద తతంగమే జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల చౌకధరల దుకాణం నంబర్ 3211010లో లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన 108.31 క్వింటాళ్ల బియ్యం స్టాక్‌లో లోటు రావడంతో సంబంధిత డీలర్‌పై పౌరసరఫరాలాశాఖ అధికారులు 2023లో 6ఏ కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన అధికారులుపై విషయాన్ని నిర్ధారించి షాప్‌ను సీజ్‌చేసి, స్టాక్‌ను జప్తు చేశారు. కేసుకు సంబంధించిన విచారణ జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతోంది. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం సదరు కేసును డిస్పోజ్ చేస్తూ దుకాణం పునరుద్ధరించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ ఘటనలో అధికారులపై ఒత్తిడితోపాటు కొంతనగదు కూడా చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ. 10వేల పెనాల్టీతో సరి....

చౌకధరల దుకాణంలో మాయమైన నిల్వ బియ్యం విలువ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 3లక్షల పై చిలుకు ఉంటుందని అంచనా. ఈ క్రమంలో 108.31 క్వింటాళ్లకు సంబంధించి క్వింటాలుకు రూ. 3200 చొప్పున వాటి మొత్తం విలువ రూ. 3,46,592 అవుతుంది. బియ్యం నిల్వలు లేనందున సరుకు అసలు విలువకు రెట్టింపు పెనాల్టి విధిస్తారు. ఈ క్రమంలో సుమారు రూ.7లక్షల వరకు డీలర్ చెల్లించాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా కేవలం రూ. 10వేలు అపరాద రుసుం విధిస్తూ కేసును డిస్పోజ్ చేయడం అనుమా నాలకు దారి తీస్తోంది.

సంతకాల ఆధారంగా కేసు డిస్పోజ్...!

సాధారణంగా చౌక ధరల దుకాణాల్లో కొన్నాళ్లుగా బయోమెట్రిక్ విధానంలోనే రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. అయితే 6ఏ కేసు ఎదుర్కొంటున్న షాపు లో మాత్రం మ్యానువల్‌గా...

మిగతా 7లో

రైతు భరోసా ప్రారంభోత్సవ కార్యక్రమం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్,జూన్16(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా వానాకాలం 2025 పెట్టుబడి సాయం ప్రారంభ కార్యక్రమం మండలంలోని ముల్కల్ల రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి క్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ కుమార్‌దీపక్ హాజరయ్యారు. సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా 2025 ప్రారంభ కార్యక్రమం దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ప్రత్యేక ప్రసారం ఏర్పాటు చేయడంతో ముల్కల్ల రైతు వేదికలో కలెక్టర్‌తో పాటు రైతులు వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. ముల్కల్ల క్లస్టర్ పరిధిలోని ర్యాలీగఢ్‌పూర్, నాగారం, చిన్నగోపాల్‌పూర్, గడ్‌పూర్, వేంపల్లి, ముల్కల్ల గ్రామాలకు సంబంధించిన రైతులు సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఆత్మ చైర్మన్ సింగతి మొరళి, మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మముని, ప్రకృతి సేంద్రియ రైతులు కేవీ ప్రతాప్, పుస్కూరి శ్రీనివాసరావు, గోనే సతీష్‌రావు, దేగబాపు, పడ్తన్‌పల్లి పీఏసీఏ చైర్మన్ రామరావులు పాల్గొన్నారు.

నస్పూర్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా నస్పూర్ పట్టణం సీతారాంపల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో చేపట్టిన కార్యక్రమాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి అనిత, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఉద్యాన వన శాఖ అధికారి తిరుపతి, వ్యవసాయ విస్తకరణాధికారి తిరుపతి, లతో పాటు రైతులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం మంచిర్యాలోని బీజేపీ కార్యాలయంలో 11 సంవత్సరాల మోదీ పాలన ఎగ్జిబిషన్ ప్రారంభించి మాట్లాడారు. ఇన్నేళ్ల పాలనలో దేశం ప్రపంచం దృష్టిని ఆకర్షించింద న్నారు. ప్రధాని మోదీ రాక ముందు కాంగ్రెస్ పాలనలో దేశం అవినీతిలో కూరుకు పోయిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాక్‌కు మోదీ గట్టి బుద్ధి చెప్పారన్నారు. ప్రధాని మోదీ వల్ల ప్రపంచ దేశాలన్నీ జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయన్నారు. ఈ సమావేశంలో సీని యర్ నాయకుడు వెరబెల్లి రఘునాథ్, నాయకులు ఏమాజీ, వెంకటకృష్ణ, అశోక్, పురుషోత్తం, కృష్ణమూర్తి, పురుషోత్తం, అశోక్‌వర్ధన్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రావు, శ్రీకృష్ణదేవరాయలు, మల్లికార్జున్, రమేష్, సంతోష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

లక్షెట్టిపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఒక న్యాయవాదిపై దాడి మరొక న్యాయవాదిని కిడ్నాప్ చేయడాన్ని నిరసిస్తూ లక్షెట్టిపేట న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ సి టి సివిల్ కోర్టుకు చెందిన న్యాయవాది నారాయణను గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేయడం అంతే కాకుండా మరొక న్యాయవాది అయిన శైలేష్‌పై దాడి చేయడం చాలా అమానుషం అన్నారు. రోజురోజుకు న్యాయ వాదులకు రక్షణ లేకుండా పోయిందని న్యాయవాదుల రక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్ రావు, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, గాండ్ల సత్యనారాయణ, నళినికాంత్, ప్రదీప్‌కుమార్, పద్మ, ప్రకాశం, గణేష్ పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

నస్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నస్పూర్ మండల మూడవ మహాసభలో తీర్మానాలను వెల్లడించారు. యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి సింగరేణి ప్రాంతంలో నూతన గనుల మంజూరు కోసం ప్రయత్నాలు చేస్తామన్నారు. ఓపెన్ కాస్టు నిర్వాసితులకు ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా యాజమాన్యం ఒత్తిడి తెస్తామ న్నారు. ఓపెన్‌కాస్టులో కాంట్రాక్టు కార్మికులు, డ్రైవర్లు ఇతరత్ర పనులు చేసుకునే వారందరికి హైపవర్ వేతనాలను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లా మహాసభలు మంచిర్యాల పట్టణంలో జరుగు తున్నాయని, ఈ జిల్లా మహా సభలకు పలువురు ప్రముఖులు హాజరవు తున్నారన్నారు. ఈ సమావేశంలో నస్పూర్ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శి లింగం రవి, కోశాధికారి మిరియాల రాజేశ్వర్ రావు, నాయకులు రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేశ్, దొడ్డిపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల చెల్లింపులో అవకతవకలపై విచారణ జరపాలి

- మహిళా సంఘం సభ్యుల ఆందోళన

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : హరితహారం మొక్కల డబ్బుల చెల్లింపులో అవకతవకలపై విచారణ జరపాలని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళ సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీలో హరితహారం మొక్కల పెంపకానికి సంబంధించి 2018-19, 2019-20 సంవత్సరంలో 12 గ్రూపుల నుంచి ఆ గ్రూపు సభ్యులు 60 వేల మొక్కలు పెంచి మున్సిపల్ అధికారులకు ఇచ్చారన్నారు. కానీ డబ్బులు మాత్రం ఏళ్లు గడిచినా గ్రూపు మహిళలకు చెల్లించలేదన్నారు. ఈ విషయంపై సమాచారం చట్టం ద్వారా వివరాలు సేకరించగా హరిత హారంలో మొక్కలు పెంచిన డబ్బులు మొత్తం చెల్లించినట్లు అధి కారులు వివరణ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ హరితహారం మొక్కల డబ్బుల చెల్లింపులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని మహిళ సంఘం సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం గ్రూపు సభ్యులుదాసరి రాజేశ్వరి, భాగ్యలక్ష్మీ, అనిత, లక్ష్మీ, రమణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల మండల స్థాయి ప్రవేశ పరీక్ష

జైపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 2005-26 విద్యా సంవత్సరానికి గాను హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి గాను ఈ నెల 18న జైపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్, మండల ఇన్‌చార్జీ వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ఉంటాయని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ప్రింట్ కాపీని తీసుకురావాలని కోరారు.

మందమర్రిరూరల్ : క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 18న మండలంలోని ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఎంఈవో దత్తుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలలోగా హాజరు కావాలని కోరారు.

టీఎన్జీవోస్ విచారణాధికారిని తప్పించండి..

అధ్యక్షుడు శ్రీహరిని బదిలీ చేయాలని కలెక్టర్‌కు వినతి

నస్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : టీఎన్జీవోఎస్ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అవకతవకలపై సక్రమంగా చేసే విధంగా ఇతర జిల్లాలకు చెందిన అధికారిని విచారణాధికారిగా నియమించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అవకతవకలపై విచారణ అధికారిగా హన్మంత రెడ్డిని నియమించారని, ఆయన అదే సంఘంలో సభ్యుడిగా ఉన్నందున నిష్పాక్షపాతంగా విచారణ చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. సొసైటీలో జరిగిన అవకతవకల్లో భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు పలు అనుమానాలు ఉన్నందున విచారణాధికారి హన్మంత రెడ్డిని మార్చాలన్నారు. అలాగే టీఎన్జీవోఎస్ అధ్యక్షుడు గడియారం శ్రీహరిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘంలో బాధ్యులుగా ఉన్న వారిని విచారణాధికారి నియమించడం సరికాదన్నారు. ఇలా ఇవ్వడం వలన జరిగిన అవకతవకలను కూడా బయ టపెట్టకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేసి అన్ని సక్రమంగానే ఉన్నాయని నివేధిక ఇచ్చిన ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుతామని ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యాక్షుడు నాగుల కిరణ్ బాబు, నాయకులు కుమ్మరి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నాయకుల ధర్నా

నస్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తమకు కేటాయించిన స్థలాన్ని మ రొకరికి ఇచ్చే ప్రయత్నాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఆటోడ్రై వర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ అందించారు. ఈ సందర్భంగా ఆటోయూనియన్ నాయకులు మాట్లాడుతూ తమకు 25 ఏళ్ల కిందట సింగరేణి అధికారులు ఆ యూనియన్ కొరకు స్థలాన్ని కేటాయించారన్నారు. ఇంతకాలం ఆస్థలాన్ని తాము వినియోగిస్తున్నామని, ప్రస్తుతం రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వచ్ఛంద సంస్థకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆ భూమిని ఎవరికి ఇవ్వకుండ తమకే కేటాయించి పట్టా ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు రాము కుమార్‌తో పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

యోగాతోనే మెరుగైన ఆరోగ్యం

- కలెక్టర్ కుమార్ దీపక్


యోగా దినోత్సవ గోడప్రతులను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్16 (ఆంధ్ర జ్యోతి): యోగాతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని, యోగానే జీవితంలో భాగంగా చేసుకోవాలని కలెక్టర్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరిక్రిష్ణలతో కలిసి అంతర్జాతీయ యోగాదినోత్సవ గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతిఒక్కరు నిత్యంయోగ చేసేందుకు సమయం కేటాయించాలన్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలంటే యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వంద ఆయుష్మాన్, ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఆసుప త్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సంవత్సరం ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా నినాదంతో ప్రపం చవ్యా ప్తంగా యోగాదినోత్సవాన్ని జరుపుకోనున్నార న్నారు. జిల్లాలో నిర్వహించే యోగా దినోత్సవ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థ లు, ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ వైద్యాధికారి పద్మజ, మెడికల్ అధికారులు మేఘన, క్రిష్ణబాయి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణలతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పొన్నారం, దండేపల్లి, మందమర్రి, జన్నారం, జైపూర్, హాజీపూర్, కాసిపేట, బెల్లంపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు
- మరింత మెరుగుపడనున్న సేవలు

6

క్రీడాకారిణికి సన్మానం

ఆసిఫాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో మే నెల 30 నుంచి జూన్ 1 వరకు జరిగిన సౌత్ ఆసియా క్రీడలో అత్యాపత్యలో భారత్‌దేశం తరపున పాల్గొని బంగారు పతకం సాధించిన గెడెం సుహాసినిని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అభినందించారు. సోమవారం సుహాసిని కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవడంతో సన్మానించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

కౌటాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలిక ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయింది. బాలిక ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో కొన్ని గంటల పాటు కూర్చోని ఉండడంతో అక్కడి దుకాణాల వారు గమనించి చేరదీసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ముత్యం రమేష్ ఆదేశాలతో వెంటనే స్పందించిన ఎస్సై విజయ్ సిబ్బందితో బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇంతలోనే బాలికను వెతుకుతూ ఆమె తండ్రి రావడంతో పూర్తి వివరాలు తెలుసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి బాలికను అప్పగించారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పీఎంఆర్‌సీ ఏసీఎంవో ఉద్దవ్ అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం రౌట సంకెపల్లిలో ధర్తి అబా భగవాన్ బిర్సాముండా 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని గిరిజన గౌరవ దినోత్సవ సమారోహం, జిల్లాలోని 102 గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కోసం ఈ పథకంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజనులకు ఆధార్, ఆయూష్మాన్ భారత్, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రజలకు వారి దగ్గర్లోనే ఆధార్ క్యాంపును నిర్వహిస్తుందన్నారు. ఆధార్‌కార్డు, ఆయూష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్ అకౌంట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్పీ రవీందర్, కార్యదర్శి మ ధుకర్, నాయకులు సుశీల, మల్లికార్జున్ ఉన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

జైనూర్, జూన్, 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడమెత విశ్వనాథ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, నాయకుడు మేస్రాం అంబాజీ తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు కోటేష్, దౌలత్‌రావ్, మహేష్ ఆనంద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బెజ్జూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే హరీ‌ష్‌బాబు ఆదేశాల మేరకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని కొలనుపాక శశిధర్, కజ్జకారి అఖిల, పేదం శివరాం, శంకరయ్య, శంభు నారాయణ, పార్వతిలు ప్రైవేటు ఆసుపత్రిల్లో వైద్యం చేయించుకోని ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్ఎఫ్ నిధికి దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిగంబర్, వసీఖాన్, కె తిరుపతి, ఎ తిరుపతి, ఎస్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు
- మరింత మెరుగుపడనున్న సేవలు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్



కాగజ్‌నగర్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సేవలు మరింత మెరుగుపడాలంటే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్‌లో ఐసీడీఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలను పోషకాహారపరంగా, విద్యాపరంగా మరింత మెరుగుపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వీటిని మేధో వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించి నివేదికలు తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కొన్నేళ్లుగా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో చిన్నారులకు, లబ్ధిదారులకు సరైన సేవలు అందడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

కొన్ని చోట్ల ఖాళీగా ఉన్న కేంద్రాలను సమీపంలోని టీచర్లకు ఇన్‌చార్జీల బాధ్యతలు అప్పగించి సేవలు అందిస్తున్నారు. మరికొన్ని చోట్ల హెల్పర్లతో కొనసాగిస్తున్నారు. సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పోస్టుల భర్తీకి సన్నాహాలు చేపడుతోంది. 10 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రాల పోస్టులను భర్తీ చేయకపోవడంతో కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. అంగన్‌వాడీలను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల ప్రమోషన్లు పెండింగ్ లోనే ఉండిపోయాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 136 మందికి ప్రమోషన్లు ప్రకటించగా అంగన్‌వాడీల్లో నూతన ఉత్సాహం రేకెత్తుతోంది. అలాగే కేంద్రాల్లోని సమస్యలు, ఖాళీల భర్తీ, ప్రమోషన్లు, పౌష్టికాహారం విషయాలపై మరింత పకడ్బందీ ప్రణాళికలతో వాటిని బలోపేతం చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో 973 కేంద్రాలు

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా మొత్తం 973 కేంద్రాలకు గానూ 120 టీచర్ పోస్టులు, 300కు పైగా హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంగన్‌వాడీ సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ పోస్టులను గుర్తించి నివేదికలు అధికారులు పంపిస్తే త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన శోభ చేకూరుతోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు పోస్టుల భర్తీకి కార్యాచరణ రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. త్వరలోనే ఈ పోస్టులను భర్తీ చేయవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీల వివరాలను సేకరించిందని నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి అని పేర్కొంటున్నారు. అయితే గతంలో లాగానే పోస్టులను ఇంటర్ మార్కుల ఆధారంగా భర్తీ చేస్తారా లేక రాత పరీక్ష మరే ఇతర పద్ధతి ఏదైనా పాటిస్తారా అనేది వేచి చూడాలి. అంగన్‌వాడీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ వచ్చినట్లయితే నిరుద్యోగుల్లో ఆశలు చిగురించే అవకాశాలున్నాయి.

వెంటనే భర్తీ చేయాలి: ముంజం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు



కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. 10 సంవత్సరాలుగా మినీ అంగన్‌వాడీలకు ప్రమోషన్లు ఇవ్వలేదు. ఇటీవల 136 మందికి ప్రమోషన్లు ఇచ్చారు. వాటిలోని ఖాళీలను భర్తీ చేయాలి. జిల్లాలో పోషకాహార లోపంతో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్‌లను బలోపేతం చేసేందుకు ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలయ్యానని..
విద్యార్థిని ఆత్మహత్య



అక్షయ (ఫైల్)

నస్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మళ్లీ ఫెయిలయ్యాననే మనస్తాపంతో నస్పూర్ పట్టణం జయశంకర్ కాలనీలో కొటోజి అక్షయ (16) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. నస్పూర్‌లోని కస్తూర్బా విద్యాలయంలో అక్షయ ఇంటర్ ఎంపీసీ (ద్వితీయ సంవత్సరం) చదివి వార్షిక పరీక్షలు రాసింది. అప్పుడు ఒక సబ్జెట్ (గణితం-2)ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ పరీక్ష రాసింది. సోమవారం వెలువడిన ఫలితాల్లో అక్షయ మళ్లీ ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఏవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఫలితాలు వచ్చిన విషయం తెలుసుకున్న తల్లి ప్రవీణ కూతురికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే ఇంటికి చేరుకుని చూసేసరికి అక్షయ ఉరేసుకుని మృతి చెంది ఉంది. అక్షయ తండ్రి కృష్ణార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

పెళ్లి పేరుతో బాలిక కిడ్నాప్..
- నిందితుడి అరెస్టు, రిమాండ్

జన్నారం, జూన్16 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని మోసం చేసి శారీరకంగా లొంగదీసుకుని కిడ్నాప్ చేసిన మోతె అర్జున్‌ను అరెస్టు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు మండలానికి చెందిన ఓ మహిళ తన పెద్దకుమార్తె కనబడడం లేదని ఈనెల 1న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం మందపల్లి గ్రామానికి చెందిన అర్జున్ బాలికను మాయమాటలు చెప్పి హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని 14రోజులు జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

దాడికి పాల్పడ్డ ఇద్దరు నిందితుల రిమాండ్

దండేపల్లి జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన భారతపు సత్తవ్వ, ప్రభాకర్‌పై దాడికి పాల్పడిన నిందితులు భారతపు కుమారస్వామి, లింగయ్యను రిమాండ్‌కు తరలించినట్లు దండేపల్లి ఎస్సై ఎండీ తహసీనోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన సత్తవ్వకు చెందిన ఇంటి పెరడు విషయంలో భారతపు కుమారస్వామి, లింగయ్యతో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగలక్ష్మిలు సత్తవ్వ పెరట్లో చొరబడి దున్నుతుండగా సత్తవ్వ అక్కడికి వెళ్లి ప్రశ్నించింది. దీంతో సత్తవ్వపై దాడికి పాల్పడ్డారు. గమనించిన సత్తవ్వ మరిది ప్రభాకర్ గొడవను అడ్డుకునేందుకు వెళ్లగా అతడిపైనా దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన భారతపు కుమారస్వామి, భారతపు లింగయ్యలను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

'స్థానిక' ఎన్నికల్లో లబ్ధి కోసమే రైతు భరోసా
- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీ‌ష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీ‌ష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రప్రభుత్వం ఇప్పుడు రైతు భరోసా వేసేందుకు ఎత్తుగడలు వేస్తోందని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు విమర్శించారు. సోమవారం స్థానికంగా తననివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 నుంచి ఇంకా మూడువిడతలుగా రైతుభరోసా రావాల్సి ఉందని, కేవలం నాలుగో విడుత ఇచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. మూడు విడతల డబ్బు దిక్కేలేదన్నారు. ఇప్పుడు రైతు భరోసా వేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భారతీయ జనతా పార్టీ శాసనసభా పక్షం తరఫున వానాకాలం రైతు భరోసా విడుదల కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం నుంచి వివిధ పథకాల కింద విడుదలైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీ‌ష్‌బాబు కోరారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్‌లను పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆర్మి శివకుమార్ పాల్గొన్నారు.

బోర్‌వెల్‌కు భూమి పూజ

దహెగాం, జూన్ 16: మండలంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మోహన్, భీమన్న, తేగయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వాంకిడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంత్ కబీర్‌దాస్ జాతీయ పురస్కారం అందుకున్న వాంకిడి మండల కేంద్రానికి చెందిన మహోల్కర్ అశోక్‌ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, ప్రభాకర్, రాజయ్య, సాయి, కార్తీక్, వెంకటి, జయరాం, దుర్గాజీ, విజయ్‌కుమార్, విఠల్, రాజేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్టివేత



నకిలీ విత్తనాలతో పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

వాంకిడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వానంపై అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి వితనాలను సోమవారం పట్టుకున్నట్లు వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని బంబార గ్రామశివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు ద్విచక్రవాహనం(ఎంహెచ్ 34ఏహెచ్ 0391)పై అనుమానస్పదంగా వస్తున్న మహారాష్ట్రలోని రాజురా తాలూకా సుకడ్‌పల్లికి చెందిన మడావి మోతిరాం వద్ద తనిఖీ చేయగా అతని వద్ద అయిదు కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో పంచనామా నిర్వహించారు. దీని విలువ సుమారు 15 వేల రూపాయలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఏఎస్సై పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తిర్యాణి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొర్రిగూడకు చెందిన కుడ్మెత దాదాజీరావు(58) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దాదాజీ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య సక్కుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అందుబాటులో ఎరువులు

జైనూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ సముదాయంలో మండల మహిళ సమాఖ్య అధ్వర్యంలో గిరిజన ప్రాంత రైతులకు ప్రభుత్వ ధరలకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కొడప మోతుబాయి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ సమాఖ్య కార్యాలయంలో కొద్ది రోజుల నుంచి ఎరువులు రైతులకు విక్రయించడం జర్గుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదేవిధంగా ప్రతి సంవత్సరం రైతులకు జెనూరుతో పాటు సిర్పూర్(యు), లింగాపూర్ వాసులు ఎరువుల కొరత మూలంగా ఇబ్బందులు పడుతుండేవారని, ఈ సంవత్సరం రైతుల ఇబ్బందులను గుర్తించి ఆయా మండల రైతులకు సమాఖ ద్వార ఎరువులు సప్లయి చేసే ఆవకాశం కల్పించడం జర్గిందని, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఎరువులు సరైన ధరలకు అవిక్రయించడం జర్గుతుందన్నారు. ఈ సందర్భంగా ఆపరేటర్ జిల్లపెల్లి గణేష్, రైతులు పాల్గోన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

లింగాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదంపూర్ గ్రామ పంచా యతీ రైతుల భూమి పట్టా సమస్యలను పరిష్కరించాలని చిన్నదంపూర్ గ్రామ రైతు లు తహసీల్దార్ నాగరాజుగౌడ్‌ను సోమవా రం కలిసి వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో రైతు నాయకులు పాల్గొన్నారు.

జైనూర్‌లో పోస్టుమార్టం నిర్వహణకు ఏర్పాట్లు

జైనూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేలా జిల్లా అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడమెత విశ్వనాథ్, వైద్యాధికారి నాగర్‌గోజే అశోక్, తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎస్సై రవికుమార్ సోమవారం ఆసుపత్రి ఆవరణంలోని ఓ గదిని పరిశీలించారు. గది పోస్టుమార్టం నిర్వాహణకు అనుకూలంగా ఉందని, మరిన్ని సదుపాయాలు సమకూర్చి జైనూరులోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తామని వైద్యాధికారి నాగర్‌గోజే అశోక్ తెలిపారు. ఈ ప్రక్రియకు మరికొన్ని రోజులు పడుతుందని మండల వాసులు సహకరించాలని ఆయన కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడమెత విశ్వనాథ్ మాట్లాడుతూ జైనూరులో పోస్టుమార్టం ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను కోరారు. నాయకులు మేస్రాం అంబాజీరావ్, కోట్నాక దౌలత్‌రావ్, కొటేష్, కనక గంగారాం పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

వేమనపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గర్భిణీ గురుడాల వసుమతి సోమవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. సోమవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. లోపల శిశువు బొడ్డుతాడు మెడకు చుట్టుకున్నట్లు గుర్తించిన అంబులెన్స్ సిబ్బంది డాక్టర్ల సూచనల మేరకు చికిత్స అందిస్తూ అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా కోటపల్లి సమీపంలోకి రాగానే సుఖప్రసవం కాగా ఆడపిల్ల జన్మించింది. అనంతరం చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ జనార్దన్ రెడ్డి, పైలెట్ ఇమామ్ షరీఫ్ ఉన్నారు.



గోలేటి టౌన్ షిప్‌నకు రక్షిత నీరు

రెబ్బెన, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గోలేటి టౌన్ షిప్‌కు సురక్షిత నీటి సరఫరాను బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి ఫిల్టర్ బెడ్ సమీపంలో నూతనంగా వేసిన ఐదు బోరు బావుల ద్వారా వచ్చే నీటిని శుద్ధి చేసి టౌన్ షిప్ వాసులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, డీజీఎం(ఐఈడీ)రాజన్న, పీటీసీ అదనపు మేనేజర్ కమ్రుద్దీన్‌ను శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. బ్రాంచ్ ఉపాధ్యక్షు డు శ్రీనివాస్, కార్యదర్శి బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాంచందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమారస్వామి, జాయింట్ సెక్రటరీ మహేందర్ పాల్గొన్నారు.

డైరెక్టర్(పా)ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు



డైరెక్టర్ గౌతం పొట్రుతో ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రును ఏఐటీయూసీ నాయకులు సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి పలు కార్మికుల సమస్యలను వివరించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, ప్రధాన కార్య దర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగలయ్య, ఉప ప్రధానకార్యదర్శులు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వైవీ రావు, ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: జీఎం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా జీఎంలు ఎం శ్రీనివాస్, దేవేందర్, విజయ భాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు

శ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయంలో ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యోగాకు పుట్టినిల్లు భారతదేశమన్నారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, స్ట్రాటా కంట్రోల్ అధికారులు శ్రీధర్, అమర్నాథ్‌రెడ్డి, పర్యావరణ అధికారి హనుమాన్‌గౌడ్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: స్థానిక జీఎం కార్యాలయంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉద్యోగులతో కలిసి యోగా చేశారు. పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ స్ట్రక్చర్ మెంబర్ రమణ, అధికారులు కిరణ్‌కుమార్, ఆసిఫ్, రమణారెడ్డి, రవి, పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరగూడ ఉపరితల గని, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, గోలేటి సీహెచ్‌పీ, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిల్లో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఎం విజయభాస్కర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఏరియా ఇంజనీర్ రామనాథం, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఉమాకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సమస్యలకు పరిష్కారం చూపండి

శ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమస్యలకు పరిష్కారం చూపాలని శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం సింగరేణి సీఎండీ ఎన్ బలరాంనకు రాసిన లేఖను శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణిలో పీఆర్‌పీ పంపిణీ ఊసే లేదన్నారు. సింగరేణి అధికారులకు 2007-08 నుంచి 2013-14 ఆర్థిక సంవత్సరాలకు చెందిన పీఆర్‌పీని అందించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యలను చీఫ్ సెక్రటరీ, ఎనర్జీ సెక్రెటరీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు అన్ని ఏరియాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అందించనున్నామని తెలిపారు. 23వ తేదీన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందిస్తామన్నారు. సమస్యలను పరిష్కరించనిపక్షంలో 24వ తేదీన నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్(అపెక్స్ కమిటీ) ఏవీరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మహేష్, సంయుక్త కార్యదర్శి భీమన్న, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణలో వేగం పెంచండి: సీఎండీ

శ్రీరాంపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాపార విస్తరణలో వేగం పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. సింగరేణి భవన్ నుంచి ఆయన అన్ని విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష నిర్వహించారు. మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోలార్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్‌డైయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్, తదితర 28 రకాల ప్రాజెక్టులు చేపడతామని, వాటిని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మరో పది రోజుల్లో కేటాయించిన ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఈడీ(కోల్ మూమెంట్) సుభాని, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) రాజశేఖరరావు, 20 విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

మునీర్ పేరిట అవార్డులు అందించాలి

మందమర్రిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గని ఉద్యోగులకు అందించే అవార్డులను సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నేత మునీర్ పేరిట అవార్డులను అందజేయాలని రెవల్యూషన్ యువజన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు అక్బర్ సోమవారం సింగరేణి సీఎండీ బలరాంను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిసి వినతిపత్రం అందించారు. మునీర్ సేవల ను దృష్టిలో ఉంచుకుని ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలన్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పీఆర్పీ చెల్లింపుల్లో జాప్యం సరికాదు

మందమర్రిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అధికారులకు రావాల్సిన పీఆర్పీ(పర్మార్మెన్స్ రిలేటెడ్ పే) జాప్యాన్ని నిరసిస్తూ మందమర్రి జీఎం దేవేందర్‌కు అధికారుల సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ 2022-23 పీఆర్పీ చెల్లింపులు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు నాగవర్ధన్, నరేష్, రవి, సంతోష్, విజయ్‌ప్రసాద్, రాంబాబు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన/జైపూర్: పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ ఇప్పించాలని కోరుతూ బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డికి, ఎస్టీపీపీ సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..

(5వ పేజీ తరువాయి)

బియ్యం పోశారని నిర్ధారిస్తూ కేసు క్లోజ్ చేశారు. లబ్ధిదారులకు 108 క్వింటాళ్ల పై చిలుకు పంపిణీ చేయాలంటే కనీసం నాలుగైదు రోజుల సమయం పడుతుందని డీలర్లే చెబుతున్నారు. ఈ నాలుగైదు రోజుల్లో ఆ షాప్‌లోని బయోమెట్రిక్ పరికరం పని చేయలేదని సంబంధిత డీలర్ చెప్పినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సదరు షాప్‌లో విచారణ జరిపేందుకుగాను 6-12-2024న ఓ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)ను ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణ జరిపిన డీటీ ఈ మేరకు 24-12-2024న పై అధి కారులకు రిపోర్టు కూడా చేశారు. ఈ క్రమంలో 15-04-2025న కేసును డిస్పోజ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సదరు షాప్ పరిధిలోగల 51 మంది లబ్ధిదారులను డీటీ విచారించగా, తమకు డీలర్ సక్రమంగానే బియ్యం పోసినట్లు కాగితంపై సంతకాలు చేసి ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు జరిపితే అసలు విషయం వెలుగుచూసే అవకాశం ఉంది.

లబ్ధిదారుల అంగీకారంతోనే..

సివిల్ సప్లై జిల్లా అధికారి బ్రహ్మారావు

రేషన్ డీలర్ తమకు మ్యానువల్‌గా బియ్యం పోసినట్లు లబ్దిదారులు అంగీకరిస్తూ డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో సంతకాలు చేశారు. డీటీ సమర్పించిన రిపోర్టు ఆధారంగానే అదనపు కలెక్టర్ కేసును డిస్పోజ్ చేశారు. ఆయన ఆదేశాల మేరకే రేషన్ షాప్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యోగా అవగాహన ర్యాలీ

నస్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నస్పూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు యోగా నిర్వాహకులు గ్రామంలో యోగా అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. స్కూలు నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రతీ ఒక్కరు యోగాపై అవగాహన కలిగి ఉండాలని, యోగ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేస్తూ నినాదాలతో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, నీరజ, డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజర్ రాథోడ్ నాయక్, యోగా శిక్షకులు సుధాకర్, మేఘన పాల్గొన్నారు.



నస్పూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకుంటున్న స్థానికులు (ఫైల్)

రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

జిల్లాలో 12,131 యూనిట్లకు గాను 52,839 మంది దరఖాస్తు

లబ్ధిదారుల ఎంపికలో మరింత జాప్యం

కాసిపేట, జూన్16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పరిచి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి నెలాఖరు వరకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలో 12,131 యూనిట్లకు దరఖాస్తులు ఆహ్వానించగా 52,839 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి తెలంగాణ ఆవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి 9వ తేదీ లోపు 50వేల నుంచి లక్ష రూపాయల లోపు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అర్హుల జాబితాను అధికారులే ఎంపిక చేయాలని ముందుగా ఆదేశాలిచ్చారు.

కానీ ప్రభుత్వం మళ్లీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతి తప్పనిసరి చేయడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగి కమీషన్ వసూళ్లకు దారి తీసింది. ప్రాథమిక స్థాయిలో జరుగుతున్న అవకతవకలను గుర్తించిన ఇంటెలిజెన్స్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీని వల్ల జూన్ 2న పంపిణీ చేయాల్సిన చెక్కులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎంపిక ప్రక్రియను ప్రక్షాళన చేసి అర్హుల జాబితాను ఎంపిక చేయాలంటే అధికారులకు తలకు మించిన భారమవుతోంది. దీనికి తోడు త్వరలో రాన్ను స్థానిక సంస్థల ఎన్నికలు రాజీవ్ యువ వికాసానికి ప్రతిబంధకంగా మారాయి. అర్హుల జాబితాలో కొందరికే మేలు జరిగితే మిగితావారు అసంతృప్తిలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే అవకాశం ఉంది. కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలవు తుందని అధికారులు సూచనప్రాయంగా తెలిపారు. దీంతో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక మరింత ఆలస్యం కానున్నది. దీంతో ఆర్జీదారుల్లో ఆందోళన మొదలైంది.

వేధిస్తున్న సిబిల్ స్కోర్ సమస్య...

లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్ సమస్య వేధిస్తోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదని ప్రకటించినప్పటికీ బ్యాంక్ అధికారులు మాత్రమే బ్యాంక్ లింకేజీ ఉండే యూనిట్లకు సిబిల్ స్కోర్ తప్పనిసరి అని అంటున్నారు. దీంతో ఎక్కువ మంది లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ లేకపోవడంతో ఎంపిక ప్రక్రియలో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో లబ్ధిదారుల్లో నైరాశ్యం నెలకొంది.

అంచనాలకు మించి దరఖాస్తులు..

రాజీవ్ యువ వికాసానికి యువత నుంచి ఆహ్వానించిన దర ఖాస్తులకు జిల్లాలో అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. లక్ష్యం 12,131 యూనిట్లకు దరఖాస్తులు ఆహ్వానించగా 52,839 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అధికారులకు కష్టతరంగా మారింది. ఎస్సీలకు 5,341 యూనిట్ల లక్ష్యం కాగా 17,596 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్టీలకు 1,644 యూనిట్లకు 4,204 మంది దరఖాస్తులు చేసుకున్నారు. బీసీలకు 3,907 యూనిట్ల లక్ష్యంగా కాగా 26,407 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈబీసీలకు 698 యూనిట్ల లక్ష్యం కాగా 1051 దరఖాస్తులు వచ్చాయి. ముస్లిం మైనార్టీ కార్పొరేషన్‌కు 452 యూనిట్ల లక్ష్యం కాగా 3,437 మంది దరఖాస్తులు చేసుకున్నారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ నుంచి 89 యూనిట్లకు లక్ష్యంగా కాగా 144 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 50వేల నుంచి లక్షలోపు రుణాలు ఇచ్చేందుకు 6,662 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించి కేవలం 4,123 మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. 2లక్షల నుంచి 4లక్షల రుణ మంజూరు కోసం 5,469 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించిగా 48,716 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం తక్కువ రుణసాయంతో ఎక్కువ మంది లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు..

ఈపథకంలో 21 ఏళ్ల నుంచి 55ఏళ్ల వారికి సర్కారు రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. మరో వైపు వ్యవసాయ అనుబంధ రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి గరిష్టవయో పరిమితి 60ఏళ్లకు నిర్ణయించడంతో రైతులు ఈ పథకం పట్ల ఎక్కువమంది ఆసక్తి చూపారు. ముఖ్యంగా పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వంటి యూనిట్లకు దరఖాస్తులు వచ్చాయి. అయితే వాటి ఏర్పాట్లలో గత ప్రభుత్వం చేసిన అక్రమాలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పథకానికి అప్రతిష్టలేకుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేసేందుకు అధికారులు కసత్తు చేస్తున్నారు.

అర్హులను ఎంపిక చేయాలి...

గొడుగు విజయ్, ముత్యంపల్లి



రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి. రాజకీయ జోక్యానికి తావులేకుండా నిరుద్యోగ యువకులను అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రభుత్వం ఉపాధి కల్పించాలి. కొన్నేళ్లుగా కార్పొరేషన్ రుణాలు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

సమస్యల పరిష్కారానికే భూభారతి సదస్సులు

రోహిత్ దేశ్‌పాండే తహసీల్దార్



ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశం ఏమిటి?

తహసీల్దార్: రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం ప్రవేశపెట్టింది. అధికారులు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఆంధ్రజ్యోతి: ధరణి పోర్టల్‌కు భూభారతి పోర్టల్‌కు తేడా ఏమిటి?

తహసీల్దార్: ధరణి పోర్టల్‌లో అనుభవదారుల కాలం ఉండేది కాదు. భూభారతి పోర్టల్‌లో అనుభవదారు కాలం పెట్టారు. అలాగే ధరణి సాఫ్ట్‌వేర్‌లో భూరికార్డుల సమాచారం నమోదు చే సిన సమయంలో జరిగిన పొరపాట్లను భూభారతి పోర్టల్‌లో సరి చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ఆంధ్రజ్యోతి: ఇప్పటికి భూ సమస్యలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: మండలంలో ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న భూ సమస్యల పరిష్కారానికి 13 తేదీ వరకు 20 సదస్సులు నిర్వహించాం. అందులో 468 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 20 తర్వాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

-దండేపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి

భీమిని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని ఎస్సై విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

బెల్లంపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌పేరుతో కొనసాగుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో చేపడుతున్న ధర్నా పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. మనోహర్, వినయ్‌కుమార్, సాయితేజ, అరవింద్‌లు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా మల్లేశ్



కాసిపేట ,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన దాగాం మల్లేశ్ ఐదవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సోమగూడెంలో జరిగిన మండల మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దాగాం మల్లేశ్, సహాయ కార్యదర్శులుగా గట్టు సర్వేసం, దుర్గం సుధాకర్, కోశాధికారిగా పులి శంకర్‌ను ఎన్నుకున్నారు.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి

దండేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఉసారపు అనే వ్యక్తిని కులం పేరుతో దూశించిన స్వర్గం శంకరయ్యపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బద్దం అంజన్న డిమాండ్ చేసారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మార్కండేయ గుడిలోకి దళితుడు వెలితే గుడి పూజారితో హుకుం జారీ చేయడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. వెంటనే నిందితుడిపై అట్రాసికి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని కోరారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాపు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

రేచినిలో ఎంపీవో పర్యటన

తాండూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని గ్రామంలో సోమవారం ఎంపీవో అనిల్‌కుమార్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

భీమిని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి విలువైన రెండె సెల్ ఫోన్లను సోమ వారం పోలీసులు బాధితులకు అందజేశారు. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ గ్రామానికి చెందిన కుడక మహేందర్, భీమిని చెందిన జే తిరుపతి తమ సెల్ ఫోన్లను పోగొట్టుకోగా వారికి అందజేశారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలక్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రాజీవ్‌నగర్‌లోని ఆదర్శపాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ(బాటనీ) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు నెల 9వ తేదీ లోపు బీఈడీ ఉత్తీర్ణులైనవారు సంబంధిత జిరాక్స్ లతో అప్లై చేసుకోవాలన్నారు. వివరాలకు 9949015156 సంప్రదించాలని కోరారు.

గుడుంబా విక్రయాలను అరికట్టాలని వినతి

మందమర్రిరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణం, మండలంలో గుడుంబా విక్రయాలను అరికట్టాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం సంఘ సేవకుడు, వెంకటాపూర్ గ్రామ వాసి వంజరి వెంకటేష్ వినతి పత్రం అందించారు.

మండల వ్యాప్తంగా గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, గుడుంబా తాగి నిరుపేదల కుటుంబాలు వీధిన పడుతున్నా యన్నారు. గుడుంబా తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం గుడుంబా అమ్మేవారిపై పీడీయాక్టు అమలు చేసిందని, దీంతో విక్రయాలు తగ్గాయన్నారు. వెంటనే గుడుంబా తయారీ, విక్రయాలు జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాసిపేట , జూన్16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసి కేసులపాలైన ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సంఘం నాయకులు గోనెల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. అర్హులైన ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల బాపు, సిలార్ ఖాన్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

గ్రామాల్లో 'రైతునేస్తం' ప్రారంభం

నెన్నెల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నెన్నెల రైతువేదికలో సోమవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్సు కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు చోట్ల రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాదు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. రైతు భరోసా, రైతునేస్తం పథకాలతో కర్షకులకు కలిగే ప్రయోజనాల గూర్చి సీఎం వివరించారు. ప్రతి మంగళ వారం ఆన్‌లైన్‌లో ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీఎం విజయలక్ష్మి, ఏఈవో రామ్ చందర్, కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఇందారం, జైపూర్ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం కింద రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికలను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానించే కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులనుద్దేశించి మాట్లాడారు. ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏఈవో మాలవిక, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : సండ్రోన్‌పల్లి, బొక్కలగుట్ట రైతు వేదికల్లో సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసాపై జరిగిన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు వీక్షించారు. వ్యవసాయాధికారులు రైతు వేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్ కుమార్, ఏవో కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, కళ్యాణి పాల్గొన్నారు.

భీమారం : భీమారంలోని రైతు వేదికలో సోమవారం రైతు నేస్తంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఎంపీవో సతీష్‌రెడ్డి, ఎస్ఐ శ్వేత, ఏఈవో అరుణ్‌కుమార్, ఏపీఎం త్రయంబక్ పాల్గొన్నారు.



ఇందారంలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

భూ భారతి చట్టంతో రైతులకు లబ్ధి



దండేపల్లిలో డీటీకి భూ సమస్యపై వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

దండేపల్లి జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో రైతులకు లబ్ధి చూకూరుతుందని దండేపల్లి తహసీల్దార్ రోహత్ దేశపాండే అన్నారు. దండేపల్లి, నంబాలలోని సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు వారి భూములపై హక్కులు కల్పించడానికి భూ భారతి చట్టం రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు.

భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డులో ఏమైనా తప్పులు ఉన్నా, లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయినా, మరే ఇతర భూసమస్యలు ఉన్నా ఈ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి తర్వాత భూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ ముత్తె లావణ్య, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

కన్నెపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రంలోని సోమవారం జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఆర్అండ్‌బీ రోడ్డు వద్దకు తీసుకువచ్చి వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డే దాటేటప్పుడు జీబ్రాక్రాసింగ్ వద్ద మాత్రమే దాటాలని సూచించారు. అలాగే వాహనదారులు నిబంధనలు పాటించాలని, ఈ విషయాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఎల్‌వోసీ అందజేసిన మంత్రి



ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన పాల్తపు ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఉన్నత చికిత్స కోసం సోమవారం రూ. 1.80 లక్షల ఎల్‌వోసీని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ బాధితులకు భరోసా సీఎం రిలీఫ్ పండ్ అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు.

అదనపు ఉపాధ్యాయుడి కోసం వినతి

భీమిని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బొడ్డుగూడ ప్రాథమిక పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుడి కోసం గ్రామస్థులు సోమవారం మండల విద్యాధికారికి కృష్ణమూర్తికి మండల విద్యావనరుల కేంద్రంలో వినతి పత్రం అందించారు. ప్రస్తుతం పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారని దీని కారణంగా బోధన నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అదనపు ఉపాధ్యాయుడిని సమకూర్చాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజా సమస్యలే పార్టీ ఎజెండా కావాలి

కాసిపేట ,జూన్16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలనే పార్టీ ఎజెండాగా మార్చుకొని ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సోమవారం సోమగూడెంలో నిర్వహించిన సీపీఐ మండల 5వ మహాసభలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాన్యులకు అందడం లేదు. కాబటి సామాన్య ప్రజల సమస్యలను గుర్తించి పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నారు. ఎర్రజెండా పేద ప్రజలకు అండగా ఉంటుందనే భరోసాను ప్రజలకు కల్పించే విధంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలని సూచించారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ప్రణాళికలను విడుదల చేశారు. ఈనెల 21, 22తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరుగబోయే జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకులు, నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముందుగాసీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ నాయకులు చిప్ప నర్సయ్య, నాయకులు దుర్గం పోచం, గట్టు సర్వేసం, దాగాం రాజలింగు, బొంతల లక్ష్మీనారాయణ, దాడి గట్టయ్య, కుర్సింగ హన్మంతు, గోలేటి రాజుకుమార్, లింగమూర్తి, సత్తయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మిత్రుల ఔదార్యం

కాసిపేట , జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమగూడెంకు చెందిన గోపే సందీప్‌కుమార్(35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జడ్‌పీ హెచ్ఎస్ కాసిపేట పాఠశాలలో 2005లో పదో తరగతి చదువుకున్న మిత్రులందరూ కలిసి రూ.20వేలు నగదును జమా చేశారు. మృతుడి కుటుంబానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి చేతుల మీదుగా కూతురికి అందజేశారు. కుటుంబ యజమాని కోల్పోయి దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి మిత్రులందరు కలిసి ఆర్థిక భరోసాను ఇచ్చారు. పాప ఉన్నత చదువులకు మరింత సహకరిస్తామని హామీ ఇచ్చారు. క్లాస్‌మెంట్‌ను కోల్పోయినప్పటికీ సహచర మిత్రులందరు కలిసి బాధిత కుటుంబానికి అండగా నిలువడం పట్ల స్థానికులు అభినందించారు.

వెలుగు కార్యాలయంలో రజతోత్సవం



కాసిపేట వెలుగు కార్యాక్రమంలో కేక్‌కట్ చేస్తున్న మహిళలు

కాసిపేట ,జూన్16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం రజతోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో పేదరిక నిర్మూలన కోసం అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. 25ఏళ్లుగా వెలుగు సంస్థ మహిళ సాధికారత కోసం, మహిళల అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టిందన్నారు. వెలుగు కార్యాలయంలో 25 ఏళ్ల వేడుకల సంబురాలు ఘనంగా నిర్వహించారు.



పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పోలీసులు

దహెగాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దహెగాం-లగ్గాం రోడ్డు గుంతలు పడడంతో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం పర్యవేక్షణలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్ సహాయంతో గుంతల్లో మొరం పోసి చదును చేశారు. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణించే బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్సై విక్రమ్, ఏఎస్సై ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ ఉత్తం, పోలీసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా అందిస్తాం

కెరమెరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రైతు భరోసా అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని ధనోర, కేస్లాగూడ, సాంగ్వీ రైతు వేదికలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయానికి సంబంధించి సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ యుగేందర్, తహసీల్దార్ భూమేశ్వర్, ఏఈఓ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: మండలంలోని జంబుగ రైతు వేదికలో సబ్‌కలెక్టర్ శ్రద్దా శుక్లా, తహసీల్దార్ మధుకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం/చింతలమానేపల్లి/సిర్పూర్(టి)/కౌటాల(ఆంధ్రజ్యోతి): దహెగాం, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), కౌటాల మండలాల్లోని పలు రైతు వేదికల్లో వీసీ నిర్వహిం చారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ మాంతయ్య, తహసీల్దార్‌లు రమేష్, మునావర్ షరీఫ్, ఏఓ కార్తేషా, నాయకులు దేవయ్య, కస్తూరి, సత్యనారాయణ, ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్పాట్ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల కళాశాలలో సోమవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ భద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సత్యనాయణ, షాలిని, సాయినాథ్, ప్రసాద్, వెంకట్‌గౌడ్, వేణు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 18 నుంచి నిర్వహించే సదరమ్, యూడీఐడీ వైద్య శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు ఒక ప్రకటనలో తెలిపరు. ఈ నెల 18న రక్తస్రావ రుగ్మత, సికిల్ సెల్, తల సేమియా, 19న మానసిక వైకల్యం, 20న ఎముకలు, 24న మూగ, చెవిటి, 26న కంటి చూపు సమస్యలు గల వారికి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

- పంచాయతీ ఎన్నికలపై మంత్రి పొంగులేటి ప్రకటన
- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం
- రిజర్వేషన్లపై ఆశావహుల చూపు

పల్లె పోరులో కదలిక



వాంకిడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ నెలాఖరులోపు ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని మొదటగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశానుసారం ప్రభుత్వ యంత్రాంగం మండల, జిల్లా పరిషత్‌లతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబందించిన ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామాలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసింది. పంచాయతీ ఎన్నికలకైతే బ్యాలెట్ పేపర్ల ముద్రణను సైతం పూర్తి చేశారు. సోమవారం నిర్వహించే మంత్రుల సమావేశంలో రిజర్వేషన్లు, తదితర విష యాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి ఈ నెల ఆఖరు వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని ప్రకటించడంతో ఆశావహుల్లో కదలిక తీసుకు వచ్చింది. దీంతో పోటీచేయడానికి అనుగుణంగా తమ మద్దతుదారులతో సమాలోచనలకు తెర తీయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

● మాస్టర్ ట్రైనీలకు శిక్షణ పూర్తి

స్థానిక సంస్థల పోరుకు ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా విజయవంతంగా నిర్వహిచేందు కు జిల్లా అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తిం పుతో పాటు బ్యాలెట్ పేపర్లు, బాక్స్‌లను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్నికల నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించే సిబ్బందికి తర్ఫీదు ఇచ్చే మాస్టర్ ట్రైనీలకు శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే సిబ్బందిని ఎంపిక చేయటం, వారికి శిక్షణ ఇవ్వటం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించనున్నారు.

● కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన

అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 అమల్లోకి తీసుకువచ్చి 2019లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించింది. జనవరి 1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో పదవీకాలం ముగి యడంతో జిల్లాలోని 335 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొసాగుతోంది. 2018 ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. 2019 జనవరి వరకు ఆరు నెలల పాటు కొసాగింది. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రత్యేక పాలన రావడం ఇది రెండోసారి.

● నాయకుల ప్రతివ్యూహాలు

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామనే మంత్రి ప్రకటనతో రాజకీయ నాయకులు ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయా రాజకీయ పార్టీల నాయకులు వ్యూహాలు రచిస్తున్నారు. కుమరంభీం జిల్లాలో అధికార పార్టీకి ఎమ్మెల్యేలు లేకపోవడంతో స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా తమ సత్తా చాటాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి ఉండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతి నిత్యం వహిస్తున్నారు. దీంతో జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సమాలోచనలో పడ్డారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆయన త్వరలో ఉమ్మడి జిల్లా నే తలతో సమావేశం నిర్వహించి స్థానికసంస్థల ఎన్నికలు ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేయనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతలు పూర్తిగా ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిలదే అని నిర్దేశించారు.

● సందిగ్ధం వీడితేనే...

రాష్ట్రంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యుల రిజర్వేషన్లపై ఇంకా స్ప ష్టత రాలేదు. అసెంబ్లీలో పంచాయతీ చట్ట సవరణ బిల్లును ఆమోదించినప్పటికీ కేంద్రప్రభుత్వం నిర్ణ యాన్ని వెల్లడించలేదు. ఇప్పటి వరకున్న రిజర్వేషన్లు రెండోసారి వర్తిస్తాయా..? లేదా అనే విషయమై స్పష్టత రాలేదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదు. ఈ నిబంధనలకు లోబడి 2019లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించారు. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజికవర్గాలకు రిజర్వేషన్లు కేటా యించే అవకాశ ముంది. జిల్లాలో 15 జడ్పీటీసీలు, 15 ఎంపీపీలు, 123 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. గత ఏడాది జులై 4న పదవీకాలం ముగిసింది. వీటికి కూడా సర్పంచ్‌లకు మాదిరిగానే రెండు పర్యాయాలు రిజర్వేషన్ అమల్లో ఉంది. ఈనేపథ్యంలో ఆశావహులు ఇప్పటినుంచే తమ ప్రయత్నాలు ప్రారంభించారు.

‘ప్రజావాణి’ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

రెబ్బెన మండలం ఎడవెల్లికి చెందిన డబ్లి తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన రాజయ్య తాను దివ్యాంగుడినని తనకు మూడు చక్రాల బండి మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ -2కు చెందిన సుమ మల్లిక, వాంకిడి మండలం జైత్‌పూర్‌కు చెందిన వెంకట్రావు, రెబ్బెన మండలం జక్కులపల్లికి చెందిన కూలీలు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన షెడ్యూల్ తెగలు, పర్దాన్ కులమకు చెందిన రైతులు తాము సాగు చేసిన భూమిని ఇతరులు ఆక్రమించారని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన పార్వతి తనకు తాటిపల్లి శివారులో దళిత బస్తీలో వచ్చిన భూమిని కొలతలు చేసి హద్దులు నిర్ణయించాలని, ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్‌కు చెందిన అమీనా బేగం తన భర్త మరణించినందు తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సుశీల రెబ్బెన మండలం నేర్పల్లి శివారులోని సర్వే నెం.32/1, 37/1లలో 2.30 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విన్నవించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని, 51 లక్షల మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. గ్రామపంచాయతీల్లో నర్సరీలు, అటవీ శాఖ నర్సరీల్లో లక్ష్య సాధనకు అనుగుణంగా మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సమన్వయంతో కృషి చేసి లక్ష సాధన దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలి: ఎమ్మెల్యే


జీవో ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టైగర్ కన్జర్వేషన్ రిజర్వు ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 49ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. గిరిజనులకు, గిరిజనేతరులకు నష్టం వాటిల్లే జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏక పక్షంగా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 49ను తీసుకు వచ్చి జిల్లాలోని గిరిజనులకు, గిరిజనేతరులకు, రైతులుకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజక వర్గాల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించ డంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందన్నా రు. ఇప్పటికైనా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు కనీసం మరమ్మతులు కరువయ్యాయని, కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట అటవీ అనుమతులు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. జీవో నంబర్ 49పై ఆదివాసులు ఆందోళన చేస్తుంటే గిరిజన మంత్రి సీతక్క సంప్రదించకపోవడం అన్యాయమన్నారు. జీవో నంబర్ 49ను ప్రభుత్వం రద్దు చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్, దీపక్ పంచధార, ప్రహ్లాద్ జయరాజ్, శ్రావణ్, ప్రసాద్‌గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

● టైగర్ జోన్ రద్దు చేయాలి..

చింతలమానేపల్లి/దహెగాం/కౌటాల: జిల్లా ను టైగర్ జోన్‌గా ప్రకటిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 49ను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు చింతలమానేపల్లి, దహెగాం, కౌటాల మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రామన్న, మల్లయ్య, తుకారాం, మురళీ, మోహన్, తిరుపతిగౌడ్ దామోదర్, ధనుంజయ్, రాకేష్, బాపు, సత్యనారాయణ, సంజీవ్, తిరుపతి, గంగాధర్, ప్రదీప్, విజయ్, మోతిరాం, మధుకర్, నరేష్, శంకర్, శ్రీను, సోమయ్య, మహేష్, తిరుపతి, వెంకటేష్, రవీందర్, కిష్టయ్య, నగేష్, మధు, లక్ష్మీ, బయక్క, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


గిరిజనాభివృద్ధి అధికారి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవికి తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వసంత్, శ్యాంరావు, రాంబాయి, మాన్కు, సంతోష్, కోటయ్య, కమల, శశికళ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

వాంకిడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీఒక్కరు సహకరించాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి శ్యాంలాల్, కౌన్సిలర్ రాజేందర్ సూచించారు. సోమవారం మండలంలోని ఖమాన గ్రామంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అనుమానితులను పరీక్షించారు. శరీరంపై ఎలాంటి మచ్చలు ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో మండల వాసి ప్రతిభ

చింతలమానేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న విడుదల అయిన నీట్ ఫలితాల్లో మండలంలోని రవీంద్రనగర్ -1 గ్రామానికి చెందిన జయేష్ ప్రతిభ కనబర్చారు. ఇంద్రజిత్ మండల్, రీనా మండల్ దంపతుల కుమారుడు జయేష్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కబర్చినందుకు మండలవాసులు అభినందనలు తెలుపుతున్నారు. జనరల్ కేటగిరిలో 29,679 ర్యాంక్, ఆల్ ఇండియా నీట్‌లో 84,292 ర్యాంకు సాధించాడు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ


మంజూరు పత్రాలను అందజేస్తున్న ఏఈ, నాయకులు

వాంకిడి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 21 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గృహ నిర్మాణ శాఖ ఏఈ నాగరాజు సోమవారం పంపిణీ చేశారు. పనులు త్వరగా ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఏఈ సూచించారు. నాయకులు నారాయణ, అనీల్, ప్రశాంత్, సునీత, పెంటు, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లో రూ.తొమ్మిది వేల కోట్లు జమ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సోమవారం ప్రారంభించిన రైతు భరోసా పథకంలో భాగంగా తొమ్మిది రోజుల్లో రూ.9000 కోట్లు అర్హత గల రైతుల ఖాతాల్లో జమ చేస్తామని, రైతు నేస్తం పథకంలో రైతు వేదికలలో వీసీ ద్వారా రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడే సదుపాయం కల్పించడం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

సోమవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శి రామకృష్ణారావుల తో కలిసి వర్చువల్ విధానం ద్వారా రైతు భరోసా, రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని 1031 రైతు వేదికలను రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వీసీ ద్వారా ప్రతి మంగళవారం రాష్ట్రంలోని రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వ్యవసాయ సాగులో అవసరమైన మెళకువలను అందించడం జరుగుతుందన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా రాష్ట్రంలోని 1.49 కోట్ల ఎకరాల భూములకు సంబంధించి 70,11,984 మంది రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లో రూ.9000 కోట్లు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాలకు సమాచారం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం కెరమెరి మండల వ్యాప్తంగా చేపట్టిన ఈజీఎస్ పనులపై గ్రామాల్లో చేపడుతున్న సామాజిక తనిఖీ బృందాలకు పనులకు సంబంధించి పూర్తి వివరాలు అందజే యాలని ఎంపీడీఓ అంజద్‌పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వివ రాలను పూర్తి స్థాయిలో సామాజిక తనిఖీ బృందం సభ్యులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ నగేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా

బెజ్జూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా అవసరమని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరికి యోగా అవసరమని అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత రోజుల్లో అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌నాయక్, యోగా శిక్షకుడు లక్ష్మణ్, యోగకర్తలు పెంటన్న, పురుషోత్తం, శంకరయ్య, పుల్లయ్య, అశోక్‌గౌడ్, కమర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ప్రజలు

పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం

సిర్పూర్(టి), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రాపూర్, సోన్‌పేట ఇంగ్లీష్, ఉర్దు మీడియం పాఠశాలలో సోమవారం ఎంఈవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో బడిబాటలో భాగంగా ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యుమరసీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంపొందించడానికి విద్యార్థులకు పలు రకాల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాటలు, కలర్‌ఫుల్ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యమైన అంశాల చార్టులను తయారు చేసి ప్రదర్శించాలన్నారు.

ఉపాధ్యాయులు చిన్నచిన్న కథలను గ్రూపులుగా చదివించాలని, క్విజ్ నిర్వహించలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ పవన్‌కుమార్, రోజారాణి, సోనియా, సుప్రీయా, కాఫిల్, హలీమా ఫార్నాజ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో హనుమంతు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో పిల్లలకు తరగతుల వారీగా టీఎల్ఎం ప్రదర్శన, అలాగే క్విజ్ పోటీలు, వివిధ కార్యక్రమాలు ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సబ్ కలెక్టర్


ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

ఆసిఫాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కాఆర్యాలయంలో ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గణితం ఉపాధ్యాయుడిని నియమించాలి

సిర్పూర్(టి), జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం గణితం ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ ఎంఈవో వేణుగోపాల్‌రావుకు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణితం ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. మండల కేంద్రంలోని జీయూపీఎస్‌లో ఉన్న గణిత ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు.

అంగన్‌వాడీల కార్యవర్గం ఎన్నిక

కెరమెరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాధ, ప్రధాన కార్యదర్శిగా సువర్ణ, కోశాధికారిగా జ్యోతికల, ఉపాధ్యక్షురాలుగా శంకరమ్మ, ఇందిరా, సహాయ కార్యదర్శులుగా చాయ, మీరా, అనసూయ, మంజులతో పాటు 19 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అంతకుముందు వాంకిడి ప్రాజెక్టు పరిధిలో రెండో మహాసభలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటాయూ నాయకులు శ్రీనివాస్, ఉమాదేవి, ఆనంద్‌రావు, వీణ, కవిత, రాధ, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.